క్లుప్తంగా

రక్తదాన శిబిరం విజయవంతం చేయండి

ఇంద్రవెల్లి: మండలంలోని పిట్టబొంగరం గ్రామంలో నవజ్యోతి యూత్, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించే మేగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు కొట్నాక్ బారిక్‌రావ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మెగా రక్తదాన శిబిరంపై ప్రచారం చేశారు. ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. కలెక్టర్ రాజర్షిషాతో పాటు ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా, అధికారులు హాజరువుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో హెల్ప్‌వీల్ ఫౌండేషన్ నిర్వాహకులు కాంబ్లే అతీష్, జైపాల్, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గంగయ్య

ఇచ్చోడ: సివిల్ సప్లయ్‌లో పనిచేసే కార్మికులు సమస్యలు పరిష్కారించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద నిర్వహించిన నిరవధిక సమ్మెలో పాల్గొని మాట్లాడారు. కార్మికుల ఒప్పందం ప్రకారం జీవోను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు, స్వీపర్లకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సివిల్ సప్లయ్ కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు సరిచేయండి

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి) గ్రామంలో ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని మాజీ సర్పంచ్ అడప్ మారుతి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న విద్యుత్ తీగలు వేలడుతుండడంతో స్కూల్ బస్సులకు, పత్తి వాహనాలకు తగులుతున్నాయన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి తీగలను సరిచేయాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న దాదిరావు

నార్నూర్: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు అన్నారు. బుధవారం మండలంలోని ఖైర్దాట్వా గ్రామంలో ఆంజనేయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఖైర్దాట్వా రాయి సెంటర్ సార్‌మేడి మాడవి సాగర్, గ్రామ పటేల్ మాడవి నారంజీ పటేల్, పెందూర్ సంతోష్, ఆత్రం జాలింషావ్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఇచ్చోడ: మండల కేంద్రంలో ప్రైవేట్ ఎలక్ట్రిషియన్స్, ప్లంబర్ నూతన మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిరిసిల్ల రమేష్, ఉపాధ్యక్షుడిగా గెడం లక్ష్మణ్, జనరల్ సెక్రటరిగా లక్ష్మణ్‌సింగ్, కోశాధికారిగా ఆడే నాందేవ్, తదితర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పేదలకు బ్లాంకెట్లు పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పేదలకు బ్లాంకెట్లు పంపిణీ చేశారు. చలి కారణంగా ఇబ్బందులు పడుతున్న వారికి వీటిని అందజేయడం జరిగిందని సొసైటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది జాదవ్ శ్రవణ్ నాయక్, బ్రహ్మ సతీష్, అజీజ్, తబ్రేజ్, హేమావతి, ప్రసన్న, లింగన్న, వంశీ, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: నూతన సంవత్సరం సందర్భంగా బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడలో బుధవారం పేద పిల్లలకు స్కూల్ షూస్‌తో పాటు దుస్తులు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం కొత్త సంవత్సరంలో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సొసైటీ సభ్యులు శ్రీకాంత్, ఆసిఫ్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని పార్డి(బి) గ్రామంలోని గౌకార్ ప్రకాష్‌కు చెందిన ఎద్దు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపాడు. వ్యవసాయంలో తోడుగా ఉండే బసవన్న మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. మండల పశువైద్యాధికారి వినోద్ దేశ్‌పాండే ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

నీరున్నా.. నిరుపయోగం..!

- ఏళ్లుగా పూర్తికాని కాలువ నిర్మాణం
- రైతులకు అందని సాగునీరు

ఇచ్చోడ : నిండా నీరున్నా నిరుపయోగంగా మారింది అడేగామ(కె) చెరువు. 2005 నిర్మించిన చెరువుకు 20 ఏళ్లు కావస్తున్నా.. కాలువ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో మూడు గ్రామాల ప్రజలు సాగునీటికి నోచు కోవడం లేదు. ప్రభుత్వం వెచ్చించిన మూడు కోట్ల ప్రజాధనం వృథా అవుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో రైతులకు సాగు నీరు అందడం లేదు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా నిండుకుండాల నీటితో ఉన్నా.. చెరువు రైతుల అవసరాలను తీర్చడం లేదు.

2005లో నిర్మాణం..

మండలంలోని అడేగామ(కె) గ్రామ సమీపంలో 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జలయజ్ఞంలో భాగంగా చెరువు నిర్మాణం కోసం రూ 2.5 కోట్లు నిధులు మంజూరు చేశారు. టెండర్లు పూర్తి చేసి కాంట్రాక్టార్‌కు పనులు అప్పగించాగా.. సదరు కాంట్రాక్టర్ ఏడాదిలో చెరువు నిర్మాణం పనులు పూర్తి చేశారు.

తొమ్మిదేళ్లుగా నిలిచిన కాల్వ పనులు..

2016లో రెండో విడత మిషన్ కాకతీయ పనుల్లో భాగంగా చెరువు నుంచి మూడు కిలోమీటర్ల మేర కాల్వ నిర్మాణం కోసం రూ. 2 కోట్లు మంజూరు చేశారు. కాల్వ నిర్మాణం పనులను ప్రారంభించారు. తనకు పరిహారం అందలేదనే కారణంలో చెరువుకు కిలో మీటరున్నర దూరంలో ఓ రైతు కాల్వ పనులను అడ్డుకున్నాడు. సదరు రైతు భూమిలో నుంచి కేవలం 100 మీటర్ల మేర కాల్వ ఉంటుంది. కాంట్రాక్టర్ సదరు రైతు భూమిలో వంద మీటర్ల పొడవు కాలువను విడిచి పెట్టి మరో కిలో మీటరున్నర పనులు పూర్తి చేశాడు. దీంతో చెరువు నుంచి కాలువకు సాగు నీటి సరఫరా నిలిచిపోయింది. సదరు రైతు పనులు ఆపి తొమ్మిదేళ్లు కావస్తున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.


నిండు కుండలా అడేగామ(కె) చెరువు

800ల ఎకరాలకు సాగునీరు..

చెరువు కింద కాలువ నిర్మాణం పూర్తయితే అడేగామ(కె), అడేగామ(బి), కోకస్‌మాన్నూర్ మూడు గ్రామాల్లోని సుమారుగా 800 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అన్ని ఉన్నా.. అల్లుడి నోట్లో శని ఉన్నట్లు మారింది రైతుల పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి


కాలువ నిర్మాణం కోసం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. కోట్ల రూపాయలు వెచ్చించిన రైతులకు చుక్క నీరు అందడం లేదు. దీంతో ప్రజాధనం వృథా అవుతుంది. కాల్వల నిర్మాణం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాంచెందర్‌రెడ్డి, అడేగామ(కె) రైతు

చొరవ చూపాలి


20 ఏళ్లుగా చెరువు నిర్మించిన రైతులకు ఫలితం లేకుండా పోయింది. అధికారులు చొరవ చూపి కాలువ నిర్మాణం పనులు ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలి. ఇక్కడి రైతులకు సాగునీరు లేక పోవడంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

– కద విశాల్, అడేగామ(బి), రైతు

ఉన్నతాధికారులకు విన్నవించాం


కాలువ నిర్మాణం పనులు అడ్డుకున్న రైతు విషయంలో రెవెన్యూ అధికారులకు విన్నవించాం. రైతుకు పరిహారం అందించి, భూమిని వెకెంట్ చేయిస్తే కాలువ నిర్మాణం పనులు పూర్తి చేస్తాం

– భీంరావు, డీఈ ,చిన్న నీటిపారుదల,

‘ప్రజలకు అండగా ఉంటా’


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: ఎన్నికల్లో ఓటమి చెందిన పేదల పక్షాన ఉంటూ ఎల్లవేళలా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. మండలంలోని రాజుగూడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేలా బీఆర్ఎస్ తరపున పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ అభ్యున్నతికి విశేష కృషి చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ సిడాం బాబురావు, పీఏసీఎస్ చైర్మన్ మెస్రం పరమేశ్వర్, మాజీ ఎంపీపీ గంద్రత్ రమేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, సేవ్వా జగదీష్, కుమ్ర రాజు, గంగయ్య, సుదర్శన్, గేడం రాము, జంగు బాపు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ పెన్షనర్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శశికాంత్, జగన్‌మోహన్, దయాకర్ రెడ్డి, పురుషోత్తం, సంతోష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యాబోధన అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందితే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. విద్య అవకాశాలు మెరుగు పడడం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిష్టన్న, అశోక్, స్వామి, సూర్యకుమార్, ఇస్తారి, విలాస్, శివన్న, గణేష్, గౌస్ మోయినొద్దీన్, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ గోడం నగేశ్

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి పల్లకి శోభాయాత్ర, మహా పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. రామాలయంలో జరిగిన మహా పడిపూజ కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ హాజరై పూజలు చేశారు. ప్రతీఏటా అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్న సమర్పణ, పంచామృత పంపిణీ చేడయం ఆనవాయితీగా వస్తుంది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చెట్లపల్లి సదానందం, రామాలయ కమిటీ చైర్మన్ జీవి రమణ, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా భీమా కోరేగాం శౌర్య దివస్


పాల్గొన్న తుడుందెబ్బ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) మావల మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలో కుమురం భీం కాలనీలో భీమా కోరేగాం శౌర్య దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు గోడం గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్‌లు మాట్లాడుతూ.. చరిత్రకు సాక్ష్యంగా 1821లో కొరేగావ్ గ్రామంలో యుద్ధం జరిగిన ప్రాంతంలో విజయస్తూపం ఏర్పాటు చేసిందన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన 22 మంది మహర్ సైనికుల పేర్లను ఆ విజయ స్థూపంపై చెక్కించిందన్నారు.

నార్నూర్: కుల వివక్షకు వ్యతిరేకంగా మహారాష్ట్రలోని భీమా కోరేగావ్ గ్రామంలో సంఘటన వీరత్వానికి ప్రతిరూపమని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద శౌర్యా దివస్ ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు హేమలత బ్రిజులాల్, లోఖండే దేవరావు, కాంబ్లే బాలాజీ, దుర్గే కాంతరావు, చాల్కుర్ ప్రకాష్, మోతిరామ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

యథేచ్ఛగా మట్టి తరలింపు


మట్టి తవ్విన ప్రదేశం

నార్నూర్: ఏజెన్సీలోని మండలాల్లో గుట్టలనే యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ, నిర్లక్ష్యం కారణంగా దర్జాగా యంత్రాలతో గుట్టాలను తవ్వుతున్నారు. అయినా... అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కనీసం అడ్డుకునే చర్యలు చేపట్టడం లేదు. స్థానిక నాయకులు అండ దండాలతో మట్టి దందా జోరుగా సాగుతోంది.

రాత్రిపగలు తేడా లేకుండా..

మండల కేంద్రంతో పాటు మహాగావ్, గంగాపూర్, నాగల్‌కొండ, భవానీగూడ గ్రామ శివారులో గుట్టలను తవ్వుతూ.. అందినకాడికి దండుకుంటున్నారు. అక్రమ మట్టి దందా జోరుగా సాగుతోంది. కస్తూరిబా గాంధీ పాఠశాల సమీపంలో రాత్రిపగలు మట్టిని తరలిస్తున్నారు. అప్పుడప్పుడు అధికారులు ట్రాక్టర్లను, యంత్రాలను సీజ్ చేసినా.. దందా మాత్రం అగడం లేదు. కొంతమంది బడా నాయకుల ఒత్తిడితో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది తమ భూములను చదను చేస్తున్నామంటూ.. రెవెన్యూ అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ భూముల్లో సైతం మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం


మండలంలో అక్రమంగా మట్టి తరలించిన, గుట్టలు తవ్విన చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. అక్రమంగా మట్టిని తరలించే వాహనాలను సీజ్ చేస్తాం. అక్రమాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తాం.

– జాడి రాజలింగు,
తహసీల్దార్, నార్నూర్

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

తలమడుగు: మండలంలో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. యువకులు నృత్యం చేస్తూ కేకులు కట్ చేశారు. మండలంలోని బరంపూర్, దేవాపూర్, ఝరి, కజ్జర్ల, సుంకిడి, కొత్తూరు, తలమడుగు, లింగి, కుచులపూర్,ఉండం, ఖోడథ్, రుయ్యాడి గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి అడే గజేందర్, తలమడుగు మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఎంపీపీ కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్, కలెక్టర్ రాజార్షి షాను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు నారాయణ, శ్రీధర్‌రెడ్డి, అశోక్ రెడ్డి, సంతోష్, రమేశ్‌రెడ్డి, వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

ఆదిలాబాద్: నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆంగ్ల నూతన సంవత్సర ప్రారంభం నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిసి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.


కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఇచ్చోడ: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను బుధవారం ఇచ్చోడ మండల బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అంగ్లనూతన సంవత్సరం సందర్భంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఎంపీని కలిసిన వారిలో ఇచ్చోడ మాజీ జెడ్పీటీసీ సోన్ కాంబ్లే, కృష్ణకుమార్, జామిడి మాజీ సర్పంచ్ హరన్ సుభాష్‌పటేల్, నరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: కొత్త సంవత్సర వేళ ఆదిలాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల ఆయన క్యాంపు కార్యాలయంలో అభిమానుల సందడి నెలకొంది. నియోజక వర్గంలోని నలు మూలల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూల బొక్కేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోని పలు అంశాల గురించి చర్చించారు.

రుద్రాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతుల పూజలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న 85వ విశ్వశాంతి అయుత మహాచండి యాగంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ దంపతులు బుధవారం పాల్గొన్నారు. యాగంలో భాగంగా ఉదయం రుద్రాభిషేకం చేపట్టగా, ఉత్సవంలో భాగస్వామ్యులయ్యారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. మహాశివుడి కరుణతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: పీఆర్టీయూ టీఎస్ నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము కృష్ణకుమార్, నర్సింహస్వామి, గోవర్ధన్, పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులు సుధాకర్, వృకోధర్, సాయికాంత్, శ్రీనివాస్, నారాయణ్, కిషోర్‌లు ఆవిష్కరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొమురంభీం విగ్రహం వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య వ్యవస్థలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఎస్టీయూ నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని బుధవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షిషాలు వేర్వేరుగా ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, బెజ్జంకి రవీంద్ర, దిలేష్ చౌహాన్, రవికుమార్, మనోహర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

బజార్‌హత్నూర్: మండలంలోని న్యూఅనంతపూర్ గ్రామానికి చెందిన తుమ్రం శ్రీరాం బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మిషన్ లిటిల్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

‘మాలీలు ఏకం కావాలి’


మాట్లాడుతున్న సుకుమార్ పేట్కులే

ఆదిలాబాద్‌రూరల్: సామాజిక న్యాయం కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న మూడు లక్షల మంది మాలీ కులస్తులు ఏకం కావాలని అఖిల భారతీయ మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత 24 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నా సామాజిక న్యాయం జరగడం లేదన్నారు. జనవరి 3న సావి త్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని గ్రామాల్లో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. జనవరి 12న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, పటేళ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు షిండే గంగారం, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అద్వకేట్ ఉమేశ్ రావు డోలే, జిల్లా కార్యవర్గ సభ్యులు విట్టల్ కొట్రంగే తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సహకరించాలి


నినాదాలు చేస్తున్న నాయకులు

బేల: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మండల కమిటీ సభ్యులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాల వర్గానికి చెందిన కొందరు పెద్దలు ఎస్సీ వర్గీకరణ బిల్లును అడ్డుకోవడం తగదని హెచ్చరించారు. ఎవరైనా అడ్డు వస్తే వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూమన్న, కృష్ణపెల్లి అంకుష్, దేవన్న, అనిల్, తదితరులు పాల్గొన్నారు.